ముంచుకొస్తున్న నీటి గండం

- ఎస్ఎస్ ట్యాంకులో అడుగంటుతున్న నీటి మట్టం
- 35 రోజులకు సరిపడా నీరు మాత్రమే లభ్యం
- ఎంపీహౌస్ నుంచి రోజూ 9 ఎంఎల్‌డీ పంపింగ్
- పొదుపుగా వాడుకుంటేనే ప్రయోజనం


కణేకల్లు వద్దనున్న తాగునీటి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు


అడుగంటుతున్న జలం

రాయదుర్గం: పట్టణ ప్రజల దాహార్తి తీర్చే కణేకల్లు సమ్మర్ స్టోరేజీ (ఎస్ఎస్) ట్యాంకులో నీటి నిల్వ తగ్గింది. దీంతో పట్టణంలో తాగునీటి గండం ముంచుకొచ్చే అవకాశం ఉంది. సమ్మర్‌స్టోరేజీ సామర్థ్యం 3,052 ఎంఎల్ కాగా, ప్రస్తుతం 585 ఎంఎల్ (మిలియన్ లీటర్స్) నీరు అందుబాటులో ఉంది. ఈ నీటిని వచ్చే జూలై నెలలో రెండు లేదా మూడో వారం వరకు వినిగించుకునే అవకాశం ఉంది. ప్రస్తుత లెక్కల ప్రకారం 35 రోజులకు సరిపడా నీరు మాత్రమే లభ్యం కానుంది. దీంతో నీటి పొదుపుపై అధికారులు దృష్టి సారించారు. మూడు రోజులకోసారి విడుదల చేసే నీటిని ఐదు రోజులకు పెంచారు. ఇందులోనూ నీటి ఆవిరి, పైపులైన్ లీకేజీలతో మరో పది శాతం నీరు వృథా కావొచ్చని అధికారులు అంచనాకు వచ్చారు. ఇదివరకు పంప్‌హౌస్ నుంచి 14 ఎంఎల్ నీటిని పంపింగ్ చేసేవారు. ప్రస్తుతం దాన్ని తగ్గించి 9 నుండి 12 ఎంఎల్ తో సరిపెట్టారు. తాగునీటి విషయంలో అధికారులు కంటే ప్రజలే ఎక్కువ జాగ్రత్త వహించాలి. లేకుంటే భవిష్యత్తులో కన్నీటి కష్టాలు తప్పవు.

హెచ్ఎల్‌సీ నీటిపైనే ఆధారం

కర్ణాటక రాష్ట్రంలో ఎగువనున్న తుంగభద్ర (టీబీ) డ్యాం నిండితేనే హెచ్ఎల్‌సీ ద్వారా సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నింపేందుకు అవకాశం. ప్రస్తుతం డ్యాంలోకి ఆశించిన స్థాయిలో నీరు చేరడం లేదు. టీబీడ్యాం నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, శుక్రవారం 5.145 టీఎంసీలు మాత్రమే నీరు చేరింది. కేవలం 950 క్యూసెక్కులతో మాత్రమే ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సాగు, తాగునీటి వరప్రదాయినిగా చెప్పుకునే ఈ డ్యాంపైనే అటు రైతాంగం, ఇటు 75 వేల మంది పట్టణ ప్రజలు ఆధారపడ్డారు.

ఆందోళన కలిగిస్తున్న లీకేజీలు..

కణేకల్లు సమ్మర్ స్టోరేజీ నుంచి రాయదుర్గం పట్టణానికి తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ లీకేజులు ఆందోళన కలిగిస్తున్నాయి. సుమారు 30 కిలోమీటర్ల దూరం నుంచి నీటిని తీసుకొచ్చే ఈ పైప్‌లైన్ తరచూ ఎదో ఓచోట లీకేజీకి గురవుతోంది. తాజాగా వీరాపురం ఫారెస్, కణేకల్లు వద్ద సుమారు 3 ఇంచుల నీరు లీకేజీ అవుతోంది. దాన్ని అరికట్టాలని చూస్తే సుమారు వారం రోజులు నీటి సరఫరాకు ఆటంకం కలిగే అవకాశం ఉంది. దీంతో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందని అధికారులు వాటి జోలికి వెళ్లడం లేదు. భవిష్యత్తులో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేస్తేనే ప్రయోజనం.

పొదుపుగా నీటిని వాడుకోవాలి



ప్రజలకు ఇబ్బందుల్లేకుండా తాగునీరు అందిస్తున్నాం. ప్రస్తుతం ఎస్ఎస్ ట్యాంకులో నీటి కొరత కనిపిస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలంతా వృథాగా కాకుండా పొదుపుగా నీటిని వినియోగించుకోవాలి. స్వచ్ఛమైన తుంగభద్ర జలాలను ఈ కొన్నాళ్లు తాగునీటికి మాత్రమే వాడుకుని, మిగిలిన బోరు నీటిని ఇతర కాలకృత్యాలకు వినియోగించుకోవాలి. ఆలోపు తప్పక ఎస్ఎస్ ట్యాంకు నిండుతుంది.

– పొరాళ్ల శిల్ప, మున్సిపల్ చైర్‌పర్సన్, రాయదుర్గం

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



ప్రస్తుతం ఎస్ఎస్ ట్యాంకులో ఉండే నీటిని 35 రోజుల వరకు సమృద్ధిగా వినియోగించుకోవచ్చు. ఆ తర్వాత తుంగభద్ర జలాశం తప్పక నిండుతుంది. కనీసం గేట్ల వరకు నీరొచ్చినా స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో నింపుకోవచ్చు. ఈ కారణంగా ప్రజలెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసనం లేదు. పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా పొదుపుగా నీటిని వినియోగించుకోవాలి.

– కిశోర్, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

క్లుప్తంగా

వరుణుడి కోసం రైతుల ఎదురుచూపు


వేరుశనగ విత్తేందుకు పొలాన్ని సిద్ధం చేసిన దృశ్యం

కూడేరు: ఖరీఫ్ సీజనల్‌లో వర్షాధారం కింద ఈనెల 15 నుంచి వేరుశనగ విత్తుకోవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. విత్తనం వేసేందుకు రైతులు విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్నారు. పొలాలను దుక్కులు చేసుకొని పెట్టుకున్నారు. కానీ వరుణుడు కరుణించలేదు. ఈ నెల 15 నుంచి జూలై15 వరకు విత్తుకోవడానికి అదును అని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో రైతులు వేరుశనగ పంట సాగు చేస్తారు. మేఘాలు ఊరిస్తున్నాయి. కానీ పదునైన వర్షం కురవలేదు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

ఉరవకొండ: స్థానిక ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఉరవకొండ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి ఓ ప్రకటనలో తెలిపారు. లోక్‌అదాలత్‌లో రాజీ కాదగిన సివిల్, క్రిమినల్ కేసులను సత్వరమే పరిష్కరించుకోవాలన్నారు.

హెచ్చెల్సీ యూటీ పనుల పరిశీలన


హెచ్చెల్సీ కాలవ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్: డి.హీరేహాళ్ మండలంలోని చెర్లోపల్లి వద్ద 119–600 కిలో మీటరు వద్ద జరుగుతున్న పనులను హెచ్చెల్సీ డీఈ మద్దిలేటితో కలిసి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. పనులపై ఆరా తీశారు. భవిష్యత్తులో నీటి ప్రవాహం ఉన్నా.. ఇబ్బందులు కలగకుండా పనులు జరిపించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సాగునీటిని ఆయకట్టుకు అందించాలన్నారు.

కృష్ణమూర్తి సేవలు మరువలేనివి


కృష్ణమూర్తి దంపతులను సన్మానించిన దృశ్యం

కూడేరు: పీఏబీఆర్ సబ్ డివిజన్ కూడేరు కుడి కాలువ విభాగంలో హెల్పర్‌గా పనిగా పని చేస్తున్న కృష్ణమూర్తి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు కూడేరులోని హెచ్‌హెల్సీ క్వార్టర్స్‌లో హెచ్ఎల్సీ, ఇతర శాఖల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల, కుల సంఘాల నేతలు కృష్ణమూర్తి దంపతులను సన్మానించారు. విధి నిర్వాహణలో ఆయన అందించిన సేవలను కొనియాడారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల వితరణ

బెళుగుప్ప: మండల పరిధిలోని హనిమరెడ్డిపల్లి, కాలువపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అనంతపురం ఏజీఎస్ ఎడ్యుకేషన్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు అందించారు. శుక్రవారం ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసి కార్యక్రమంలో ఏజీఎస్ సంస్థ వ్యవస్థాపకులు ఏజీ ప్రమీలమ్మ పాల్గొని విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ప్రథమ శ్రేణి విద్యార్థులందరికీ డిక్షనరీలు, ప్యాడ్‌లు అందించారు.

కణేకల్లు–కళ్యాణదుర్గం బస్సు సర్వీసు ప్రారంభం


కణేకల్లు–కళ్యాణదుర్గానికి ప్రారంభమైన బస్సు సర్వీసు

కణేకల్లు: కణేకల్లు–కళ్యాణదుర్గం ఆర్టీసీ సర్వీసును అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ఏడేళ్ల క్రితం కణేకల్లు–కళ్యాణదుర్గానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిపివేశారు. కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపో అధికారులు కళ్యాణదుర్గం –బళ్లారి బస్సు సర్వీసులను కణేకల్లు క్రాస్ మీదుగా నడుపుతున్నారు. కణేకల్లు క్రాస్ నుంచి కణేకల్లుకు ఏడు కిలోమీటర్ల దూరం ఉంది. గతంలో కళ్యాణదుర్గం–బళ్లారి బస్సులన్నీ కణేకల్లుకు వచ్చి వెళ్లేవి. కళ్యాణదుర్గం–బళ్లారి, బళ్లారి–కళ్యాణదుర్గానికి రాకపోకలు కొనసాగించే ప్రయాణికులు బస్సులను కణేకల్లును తప్పించి డైరెక్ట్‌గా నడపాలని కోరడంతో ఆర్టీసీ అధికారులు సర్వీసులు నడిపారు. ఈ బస్సు 8 సింగిల్స్ నడుస్తుందని అధికారులు తెలిపారు.

పశుగర్భకోశ వ్యాధులపై అవగాహన


మాట్లాడుతున్న డీఎల్‌డీపీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్

బ్రహ్మసముద్రం: మండలంలోని ఎస్.కోనాపురంలో ఉచిత పశువైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. పశువైద్య అధికారి డాక్టర్ నవీన్‌కుమార్ గ్రామంలో దాదాపు 65 పశువులకు గర్భకోశ పరీక్షలు చేశారు. దాదాపు 50 పశువులకు నట్టల నివారణకు మందులు వేశారు. ముద్దచర్మ వ్యాధి సోకిన 215 పశువులకు టీకా వేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు వనిత, పశు సంవర్ధకశాఖ సహాయకులు ప్రియాంక, గోపాలమిత్రలు, పాడి రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

32 పాడి పశువులకు గర్భకోశ చికిత్స

శెట్టూరు: మండలంలోని పెరుగుపాళ్యంలో 32 పాడి పశువులకు గర్భకోశ చికిత్స చేశారు. శుక్రవారం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో పశువుల గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. డీఎల్‌డీపీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ పాడి రైతులకు పశువుల్లో గర్భకోశ వాధులు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. సకాలంలో పశువుల్లో వచ్చే ఎదను ఏవిధంగా గుర్తించాలి, నేటి పెయ్యదూడలు – రేపటి పాడి పశువులు అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ నాగలింగేశ్వర రెడ్డి, డాక్టర్ ప్రసాద్, స్థానిక సర్పంచ్ పెరుగు తిమ్మరాజు, పాడి రైతులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీని సక్రమంగా చేపట్టండి


సమావేశంలో మాట్లాడుతున్న కంబదూరు ఎంపీడీఓ సల్మాన్‌రాజు

కంబదూరు: జూలై 1న సక్రమంగా పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపీడీఓ సల్మాన్‌రాజు సచివాలయ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై సచివాలయ సిబ్బందితో సమావేశమై పింఛన్లను ఏ విధంగా పంపిణీ చేయాలన్న దానిపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆంజనేయులు, ఏపీఎం రాజశేఖర్, డాక్టర్ ఆసియా పాల్గొన్నారు.

కూడేరు: సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీపై నిర్లక్ష్యం చేయొద్దని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయలలితత తెలిపారు. శుక్రవారం జూలై 1న పింఛన్ల నగదు పంపిణీపై కూడేరు ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఆమె సమావేశం నిర్వహించారు. 50 మంది లబ్ధిదారులకు ఒక సచివాలయ ఉద్యోగిని ఏర్పాటు చేసి లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి నగదు పంపిణీ చేసేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నాగభూషణ రెడ్డి, ఏపీఎం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్: ప్రభుత్వం అందజేస్తున్న సామాజిక భద్రత పింఛన్లను జూలై 1న పకడ్బందీగా పంపిణీ చేయాలని ఎంపీడీఓ అల్లాబకాష్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో సచివాలయ, మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని 14 సచివాలయాల పరిధిలో మొత్తం 5,364 పింఛన్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రంగనాయకులు, ఏఓ చిక్కన్న, వైకేపీ ఏపీఎం జయచంద్ర, పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా పింఛన్లు పంపిణీ చేయాలి

కుందుర్పి: జూలై 1న పింఛన్లను పారదర్శకంగా పంపిణీ చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కొత్త ఫించన్ల పంపిణీ విధివిధానాలపై ఆయా గ్రామ సచివాలయాల సిబ్బందికి అవగాహన కల్పించారు. మండల వ్యాప్తంగా 7,646 మందికి వివిధ రకాల పింఛదారులకు రూ.5.26 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శంకర్, 16 గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూగజీవాలపై చిరుతల దాడి

కుందుర్పి: నియోజకవర్గ వ్యాప్తంగా రెండు నెలలుగా చిరుతలు మూగజీవాలపై దాడులు చేస్తూ చంపేస్తున్నాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల్లో కుందుర్పి మండలంలో నాలుగు, కళ్యాణదుర్గం మండలంలో ఆరు, శెట్టూరు మండలంలో మూడు, కంబదూరులో మూడు పశువులను చిరుతలు చంపేశాయని ఆయా మండలాల రైతులు చెప్తున్నారు. పొరుగున ఉన్న కర్ణాటక నుంచి ఎలుగు బంట్లు, చిరుతలను అక్కడి అటవీశాఖ అధికారులు జంబుగుంపల, కైరేవు, గొల్లపల్లి తదితర అడవుల్లోకి వదిలివెళ్లారని, దీంతో చిరుతలు పదుల సంఖ్యలో గుంపు అయినట్లు సొసులకుంట, జంబుగుంపల, బెస్తరపల్లి గ్రామాల రైతులు తెలిపారు. అటవీశాఖ బీట్ ఆఫీసర్ పరమేశ్వరప్ప మాట్లాడుతూ అడవుల్లో చిరుతల దాడుల వల్ల పశువులు చనిపోతే ఎలాంటి పరిహారం రాదని, పంట పొలాలు,ఇళ్ల వద్ద పాకల్లో చిరుతలు మూగజీవాలపై దాడి చేసి చంపితే నిబంధనల ప్రకారం పరిహారం అందుతుందన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


కంబదూరులో మొక్కలు నాటుతున్న ఎస్ఐ ఆంజనేయులు, ఎంపీడీఓ సల్మాన్‌రాజు


కళాశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్

కంబదూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ సల్మాన్‌రాజు,ఎస్ఐ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగాప్రిన్సిపాల్ శ్రీవల్లి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఎస్ఐ, ఎంపీడీఓ మాట్లాడుతూ మానవ మనుగడ సాగాలంటే పర్యావరణం దెబ్బతినకుండా కాపాడుకోవాలన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం వల్ల ఆక్సిజన్ లభించడంతోపాటు పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అంజనేయులు, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర, ఉపాధ్యాయుడు వెంకటేశులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ తెలిపారు. బొమ్మనహాళ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్‌తో కలిసి విద్యార్థులు మొక్కలు నాటి నీరు పోశారు. కళాశాలలో 150 మొక్కలు నాటారు. అధ్యాపకులు హనుమంతనాయక్, సుబ్బరాయుడు, ఆదిరాముడు, శంకర్‌లింగ, వరలక్ష్మీ, స్వప్న, గంగిరెడ్డి పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో చేరాలి


వజ్రకరూరు మండలం గంజికుంటలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది


కళ్యాణదుర్గం మండలం చాపిరిలో ర్యాలీ చేస్తున్న విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు

కళ్యాణదుర్గం రూరల్: బడిఈడు పిల్లలు బడిలో చేరాలని ఎంఈఓ విజయ్‌కుమారి, బాబు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చాపిరిలో నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం బడి మానేసిన విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి పిల్లలను బడిలో చేర్పించాలని, చదువుకుంటేనే పిల్లల భవిష్యత్తు మారుతుందని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ప్రసాద్, అంగవాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలందరికీ బడిలో చేర్పించాలి

వజ్రకరూరు: బడిఈడు పిల్లలందరినీ తప్పనిసరిగా బడిలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హెచ్.పద్మా తెలిపారు. శుక్రవారం మండలంలోని గంజికుంట గ్రామంలోని అంగన్‌వాడీ – 1 పరిధిలో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హెచ్.పద్మా, అంగన్‌వాడీ కార్యకర్తలు లోకమ్మ, లక్ష్మిదేవి, నాగమణి, అనసూయమ్మ, సునిత, అంగన్‌వాడీ ఆయాలు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

బ్రహ్మసముద్రం: మండలంలోని కన్నేపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఖాసీబీం ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే శుక్రవారం నిర్వహించారు. ఐదేళ్ల నిండిన చిన్నారులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. మూడేళ్ల నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరుతూ 'అంగన్ వాడీ పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక ప్రధానోపాధ్యాయులు నాగమణి, టీచర్ ఎర్రిస్వామి, పంచాయతీ కార్యదర్శి వెంకటరాముడు, మహిళా పోలీస్ జయ, ఏఎన్ఎం సంగీత, అంగన్‌వాడీ సిబ్బంది సీతమ్మ, సుజాత, ప్రమీలా, శాంతకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ

కళ్యాణదుర్గం: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు కంప్యూటర్ ట్యాలీ కోర్సులో ఉచిత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్స్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 18–28 ఏళ్ల వయస్సు ఉండి 10 నుంచి ఇంటర్, డిప్లమో, డిగ్రీ పాస్/ ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. 35 రోజుల పాటు బెంగుళూరులో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి ఉంటుందన్నారు. వివరాలకు సెల్: 9000487423లో సంప్రదించాలన్నారు.

డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోండి

- పారిశుధ్య పనుల పరిశీలనలో డీపీఓ ప్రభాకర్‌రావు


గోనేహాళ్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది


ఉరవకొండలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న డీపీఓ, ఈఓలు


చిన్నముష్టూరులో వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యాధికారులు


చాబాలలో నీటి ట్యాంకులను శుభ్రం చేయిస్తున్న సర్పంచు మల్లెలజగదీష్ తదితరులు

ఉరవకొండ: పట్టణంలో డయేరియా బారినపడి ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ఎంపీడీఓ, మేజర్ పంచాయతీ ఈఓలు చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి ఎల్.ప్రభాకర్‌రావు సూచించారు. శుక్రవారం ఉరవకొండ మేజర్ పంచాయతీ పరిధిలోని వివిధ వార్డుల్లో కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను ఈఓఆర్డీ చంద్రమౌళి, పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్‌తో కలిసి డీపీఓ పరిశీలించారు. డీపీఓ మాట్లాడుతూ డయేరియా ప్రబలకుండా వార్డుల్లో శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. గ్రామాల్లో ఓహెచ్ఎస్ ట్యాంకులను ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయించే బాధ్యత కార్యదర్శిలదే అన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వజ్రకరూరు: సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని వజ్రకరూరు వైద్యాధికారి సర్దార్ వలి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో సీజనల్ వ్యాధులు, స్టాప్ డయేరి యా, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై ప్రత్యేక సమా వేశం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ నాగశంకర్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డయేరియాను అరికడదాం

కళ్యాణదుర్గం: సమష్టిగా కృషి చేసి డయేరియాను అరికడదామని సీడీపీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ముద్దినాయనపల్లి, పాపంపల్లి గ్రామాల్లో డయేరియా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ డయేరియా నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి, హెల్త్ సూపర్‌వైజర్ వేణుగోపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి, సచివాలయ ఏఎన్ఎం షలీల, ఏఎన్ఎం ఆదెమ్మ, అంగన్‌వాడీలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిన్నముష్టూరులో వైద్య పరీక్షలు

ఉరవకొండ: మండలంలోని చిన్న ముష్టూరులో రెండు రోజుల క్రితం డయేరియాతో వృద్ధుడు మృత్యువాత పడటంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు మెగా వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. రాకెట్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యాధికారిణి డాక్టర్ పావని, మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

బొమ్మనహాళ్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండొచ్చని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారులు గీతాభార్గవి, కుమారరాజా అన్నారు. శుక్రవారం మండలంలోని సింగానహళ్లిలో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై ర్యాలీ చేశారు. వైద్యులు మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికున్ గున్యా లాంటివి సోకే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు వెంకటరమణ, ఈశ్వరమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మలేరియా, డెంగీ ప్రమాదకరం

కుందుర్పి: మలేరియా, డెంగీ ప్రమాదకరమని కళ్యాణదుర్గం డివిజన్ మలేరియా అధికారి తిరుపాలయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని మహంతపురం, కదరంపల్లి గ్రామాల్లో డెంగీ, మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకొని దోమ కాటు ఎంత ప్రమాదకరమో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు అనూషా, చాంద్‌బేగం, సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియా నివారణ కార్యక్రమాలపై సమీక్ష

బెళుగుప్ప: గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సుబ్బరాజు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఎంపీడీఓ సుబ్బరాజు అధ్యక్షతన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సప్రీన్, ఏఈ హర్షవర్ధన్, పీఆర్ ఆర్‌డీ మాధవ్‌రెడ్డితో కలసి పంచాయతీ కార్యదర్శులు సచివాలయాల అధికారులతో సమావేశం నిర్వహించారు.

చాబాలలో డ్రైడేఫ్రైడే

వజ్రకరూరు: మండలంలోని చాబాలలో శుక్రవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు డ్రైడే, ఫ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేయించారు. అనంతరం సర్పంచు మల్లెల జగదీష్ మాట్లాడుతూ సీజనల్ వ్యాదులు ప్రబలకుండా గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు మల్లెలజ గదీష్ ,గ్రామ కార్యదర్శి వెంకటేశ్, వాటర్ మెన్ దావీదు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

జనజాతర పోస్టర్ల విడుదల


శెట్టూరులో పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

శెట్టూరు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జనజాతర కార్యక్రమ పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సాకే గురుమూర్తి మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం రోజు (జూలై 7న)న మాదిగల జనజాతర కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం చింతర్లపల్లి గ్రామంలో దళితులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మండలంలోని దళితులు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు తిప్పేస్వామి, మైలారప్ప, రామన్న, బాబు, రామాంజనేయులు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

జోడు లింగాల ఆలయ కమిటీ చైర్మన్, సభ్యుల రాజీనామా


రాజీనామా పత్రాన్ని దేవదాయ శాఖ సిబ్బందికి అందిస్తున్న చైర్మన్, సభ్యులు

కూడేరు: మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ రామదుర్గం కిష్టప్ప, కమిటీ సభ్యులు మెకానిక్ శంకర్ రెడ్డి, రెంటాల శ్రీనివాసులు, ప్రతిభా భారతి, పద్మావతి శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు అందజేయాలని ఆ శాఖ ఉద్యోగి సాయికి అందించారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు కిష్టప్ప, శంకర్ రెడ్డి తెలిపారు.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి

- జిల్లా బాలల సంరక్షణ అధికారి వెంకటేశ్వరి


మాట్లాడుతున్న జిల్లాబాలల సంరక్షణ అధికారి ఎం.వెంకటేశ్వరి

వజ్రకరూరు: బాల్య వివాహాలను అడ్డుకోవాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.వెంకటేశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సెక్టార్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.వెంకటేశ్వరి మాట్లాడుతూ బాల్యవివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. చిన్నవయసులోనే వివాహాలు జరగడంవల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. బాలికలపై జరుగుతున్న లైంగికదాడులను కూడా అరికట్టడానికి కృషి చేయాలన్నారు. సీజనల్‌వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, డీసీపీయూ యూనిట్ అధికారి రమా దేవి, వజ్రకరూరు, కొనకొండ్ల, గూళ్యపాళ్యం గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.